521 మందికి సేవా పురస్కారాలు

పుట్టపర్తి, జనవరి25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అందించే ఉత్తమ సేవాపురస్కారాలకు జిల్లాలో 521 మంది అధికారులు, ఉద్యోగులను ఎంపిక చేశారు. శుక్రవారం పుట్టపర్తిలోని శిరసాని హిల్స్ వద్ద పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించే గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అవార్డులను అందజేయనున్నారు. పురస్కారానికి ఎంపికైన వారిలో 62 మంది జిల్లాస్థాయి ఉన్నతాధికారులు, 459 మంది ఉద్యోగులు ఉన్నారు.


ఎస్పీ మాధవరెడ్డి.. పరేడ్ రిహార్సల్స్..

గణతంత్ర సందడి

నేడు గణతంత్ర దినోత్సవాలు
ముస్తాబైన పరేడ్ మైదానం
పరిశీలించిన ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి రూరల్, జనవరి 25: గణతంత్ర వేడుకలకు జిల్లాకేంద్రంలోని శిరసాని పోలీసు పరేడ్ మైదానం ముస్తాబైంది. శుక్రవారం గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేదికను అలంకరించారు. అతిథుల సీటింగ్‌కు సిద్ధం చేశారు. వేడుకల రిహార్సల్స్ గురువారం సాయంత్రం చేపట్టారు. వాటిని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించి, గౌరవవందనం స్వీకరించారు. అతిథుల గ్యాలరీలు, స్టాల్స్ పోలీసు జాగిలాల విన్యాసాలను పరిశీలించారు. ఏర్పాట్లలో లోటుపాట్లకు తావివ్వద్దని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఆర్ఐలు టైటాస్, రాజశేఖర్‌రెడ్డి, నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలపై జగన్‌ది కపట ప్రేమ

అణగారినవర్గాలకు అండగా నిలిచింది టీడీపీనే.. జయహో బీసీ కార్యక్రమంలో బీకే

హిందూపురం, జనవరి 25: ముఖ్యమంత్రి జగన్.. బీసీలపై కపటప్రేమ ఒలకబోస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి విమర్శించారు. గురువారం పరిగి మండల కేంద్రంలో జయహో బీసీ కార్యక్రమం టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. జ్యోతిబాపూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం బీకే పార్థసారథి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు బీసీలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్.. ఐదేళ్ల పాలనలో చేసిందేమిటని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా అణగారిన వర్గాలపైనే దాడులు జరిగాయన్నారు. బీసీ కార్పొరేషన్లు పెట్టామని చెప్పి వాటిని నిర్వీర్యం చేశారన్నారు. 56 కార్పొరేషన్లకు ఒక్క రూపాయైనా మంజూరు చేశారా అంటూ ధ్వజమెత్తారు. బీసీలపైనే దాడులు, హత్యలకు తెగబడ్డారన్నారు. ఒకవైపు తన బీసీలు, తన ఎస్సీలంటూ చిలకపలుకులు పలికే జగన్.. మరోవైపు వారిని అణగదొక్కుతూ వచ్చారన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ఆద్యుడైన చంద్రబాబు నాయుడు పాలన కావాలని రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, నాయకులు కేశవయ్య, లక్ష్మీరెడ్డి, ఈశ్వరప్ప, లక్ష్మీనారాయణ, పాండురంగప్ప, పోతులప్ప, అనురాధ, లలితమ్మ, హనుమయ్య, చౌడప్ప, మోదారవి, నరసింహులు, జనసేన నాయకులు చంద్రశేఖర్, గోవిందప్ప పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న టీడీపీ బీసీ నేతలు

బీసీల ద్రోహి జగన్
గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్సీ

బీసీలపై కపట ప్రేమ చూపుతూ ఉన్న ముఖ్యమంత్రి జగన్ వారి పాలిట ద్రోహిగా మిగిలాడు. జగన్ బీసీల ద్రోహి. బడుగు బలహీనవర్గాలకు అండగా నిలిచేది టీడీపీయే. మొట్టమొదటి సారిగా రిజర్వేషన్ తీసుకొచ్చిన ఘనత ఎన్టీఆర్‌దే. అనంతరం రిజర్వేషన్ శాతం పెంచి అణగారిన వర్గాలకు రాజ్యాధికారాన్ని టీడీపీ పంచింది.

బీసీలందరూ బాధితులే: అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

వైసీపీ అధికారంలోకి వచ్చాక అణగారిన వర్గాల నాయకులు, సామాన్యులు బాధితులుగా మిగిలారు తప్ప.. ఏ ఒక్క బీసీ అభివృద్ధి చెందింది లేదు. ఏ ఒక్కరూ సంతృప్తిగా లేరు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుంది.

భూ పందేరం..!

అసైన్డ్ భూములు.. వైసీపీ గద్దల చేతుల్లోకి..





పంచేశారు..

- వేల ఎకరాలు పంపిణీ
- రాష్ట్రంలోనే జిల్లాకు రెండోస్థానం
- ధారాదత్తం చేసిన అధికారులు
- అధికార పార్టీ సిఫార్సులకు జీహుజూర్
- బత్తలపల్లి తహసీల్దార్‌పై వేటుతో రెవెన్యూలో అలజడి

జిల్లాలో భూపందేరం కొనసాగుతోంది. విలువైన సర్కారు భూములను అధికార పార్టీ గద్దలు సొంతం చేసుకుంటున్నాయి. రెవెన్యూ యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని వేల ఎకరాలు కొల్లగొడుతున్నాయి. భూపంపిణీకి లబ్ధిదారుల ఎంపిక నిబంధనల మేరకే చేపట్టినట్లు అధికార యంత్రాంగం చెబుతున్నా.. వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతల సిఫార్సులు, ఒత్తిళ్ల మేరకే చేశారన్నది నిర్వివాదాంశం. ఇలా వేలాది ఎకరాల అసైన్డ్ భూములు.. అధికార పార్టీ నేతలు దక్కించుకున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల అండ ఉందనీ, తనకు ఎదురేలేదని అసైన్డ్ భూపందేరం పెట్టిన బత్తలపల్లి తహసీల్దార్, ధర్మవరం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న యుగేశ్వరీదేవిపై సస్పెన్షన్ వేటు పడింది. దీంతో జిల్లాలో అసైన్డ్ భూపందేరం పెట్టిన రెవెన్యూ అధికారుల్లో ఆందోళన మొదలైంది. సస్పెన్షన్ వేటుపడిన తహసీల్దార్ ధర్మవరం, బత్తలపల్లి మండలాల పరిధిలో కోట్లాది రూపాయల విలువైన 411 ఎకరాల అసైన్డ్ భూములను అధికార పార్టీ నేతలు సాగు చేసుకుంటున్నట్లు చూపి, వారికి కట్టబెట్టేలా ఎత్తుగడ వేసి పట్టుబడ్డారు.

ధర్మవరం మండలం కుణుతూరు, ఏలుకుంట్ల, రేగాటిపల్లి, చిగిచెర్ల, బత్తలపల్లి మండలం అప్రాచెరువు, ముష్టూరు, సంగాల, మాల్యవంతం, దంపెట్ల, గరిశలపల్లి గ్రామాల పరిధిలో గతంలో పేదలకు ఇచ్చిన భూములను సాగులో లేరనీ, ఇతరులకు విక్రయించారన్న సాకులతో వెనక్కి తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటిని వైసీపీ నాయకులు సాగు చేస్తున్నట్లు నివేదికలు రూపొందించి, సీసీఎల్ఏ ఆదేశాలు లెక్క చేయకుండా వందల ఎకరాల ప్రభుత్వ భూములను అప్పనంగా వైసీపీ వారికి కట్టబెట్టినట్లు తెలుస్తోంది. ఈ ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ నెల కిందట తహసీల్దార్ యుగేశ్వరీదేవికి నోటీసులు ఇచ్చారు. పదిరోజుల్లో లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. తహసీల్దార్.. ఉన్నతాధికారులను సైతం లెక్క చేయకపోగా.. స్థానిక వైసీపీ ప్రజాప్రతినిధి ద్వారా కలెక్టర్‌కు ఫోన్ చేయించి, ఒత్తిళ్లు తీసుకొచ్చినట్లు చర్చ సాగుతోంది. ఏమాత్రం తగ్గకుండా ఆ ప్రజాప్రతినిధి అండతో తహసీల్దార్ చెలరేగినట్లు అధికార పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. జగనన్న లేఔట్లలో ఇళ్ల స్థలాలను సైతం అధికార పార్టీ నాయకులకు రాసిచ్చేశారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. తాజాగా తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు పడడం రెవెన్యూ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఇలా జిల్లావ్యాప్తంగా పేదలకు భూపంపిణీ పేరుతో ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతల ఒత్తిళ్లకు తలొగ్గి, భూపందేరం పెట్టిన రెవెన్యూ అధికారుల్లో అలజడి మొదలైంది. తమపై ఎక్కడ వేటు పడుతుందోనని వారు వణికిపోతున్నారు.



పెద్దఎత్తున వసూళ్లు

జిల్లాస్థాయి అసైన్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించకుండానే ఆయా నియోజకవర్గాల్లో జూలైలోనే భూపంపిణీ జాబితాపై జిల్లా ఇన్‌చార్జి మంత్రితో ఆమోదముద్ర వేయించారు. నియోజకవర్గాల్లో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతల సిఫార్సులు, ఒత్తిళ్లతోనే భూ పంపిణీ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సాగిందన్నది నిర్వివాదాంశం. విలువైన అసైన్డ్ భూముల్లో అధికార పార్టీ వర్గీయులే సాగులో ఉన్నట్లు దరఖాస్తులు చేయించి, రెవెన్యూ అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి బినామీల పేరిట పొందుతుండగా.. మరికొందరు తమ అనుచరుల పేరిట దక్కించుకున్నారు. ఈ వ్యవహారంలో భూమి విలువను బట్టి భారీగా వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. గ్రామాల్లో ఎకరాకు రూ.లక్ష మొదలుకుని గ్రామాలు, రహదారుల పక్క ఉంటే రెండింతలుగా ఒప్పందాలతో తంతు సాగిందన్న ఆరోపణలు లేకపోలేదు. ఇలా వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను అక్రమార్కులకు ధారాదత్తం చేయడానికి భూపందేరం పెట్టేశారు. అయినా ఈజాబితాపై ఆయా నియోజకవర్గాల్లో అసైన్‌మెంట్ కమిటీ ఆమోదముద్ర వేసింది. రాష్ట్రంలోనే అత్యధికంగా భూపంపిణీ చేపట్టిన రెండో జిల్లాగా నిలిచిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కడప జిల్లా మొదటి స్థానంలో ఉంది. జిల్లాలో ఇప్పటికే రెవెన్యూ గ్రామాల వారీగా భూపంపిణీ లబ్ధిదారుల జాబితాపై తూతూమంత్రంగా థర్డ్ పార్టీ విచారణ చేపట్టింది. ఉన్న జాబితాకే ఆమోదముద్ర వేసింది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో ఇప్పటికే వన్‌బీ పత్రాలు కూడా జారీ చేశారు. ఇది చాలదన్నట్లు రెండో విడత పేరుతో భూపందేరానికి తెరలేపారు.



జిల్లాలో భూపంపిణీలో కంచే.. చేను మేసినట్లుగా ప్రభుత్వ భూములను రెవెన్యూ శాఖాధికారులు రాసిచ్చేశారు. కొండ, గుట్టలను సైతం వదలకుండా పంచేశారు. జిల్లాలో 7631 మందికి 13041 ఎకరాల ప్రభుత్వ భూమి పంపిణీకి సెప్టెంబరులో ప్రతిపాదనలు పంపారు. జిల్లాలోని 32 మండలాల్లో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల నేతృత్వంలో దరఖాస్తులను అసైన్‌మెంట్ కమిటీలు ప్రతిపాదించాయి. పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో 2090 మందికి 2618 ఎకరాలు, ధర్మవరంలో 2544 మందికి 5291 ఎకరాలు, పెనుకొండ డివిజన్‌లో 273 మందికి 272 ఎకరాలు పంపిణీకి లబ్ధిదారుల జాబితాపై ఆమోదముద్ర పడింది.. గ్రామసభలు నిర్వహించి, లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉండగా.. దరఖాస్తుల ప్రక్రియ అంతా గోప్యంగా సాగిపోయిందన్న విమర్శలు లేకపోలేదు. ధర్మవరం, కదిరి, పుట్టపర్తి రాప్తాడు నియోజకవర్గాల్లో అసైన్డ్ భూములను కట్టబెట్టేందుకు జాబితాలో అనర్హులకు చోటు కల్పిస్తూ భారీ అక్రమాలకు తెరలేపినట్లు ఫిర్యాదులు గత సెప్టెంబర్‌లోనే వచ్చాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్ అసైన్‌మెంట్ కమిటీ ఆమోదముద్ర వేసిన జాబితాపై థర్డ్‌పార్టీ విచారణకు ఆదేశించారు. పుట్టపర్తి, ఓబుళదేవరచెరువు, నల్లమాడ, ధర్మవరం, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో రెవెన్యూ బృందాలు తూతూమంత్రంగా విచారణ చేపట్టి, ఆ జాబితాకే పచ్చజెండా ఊపాయి. పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ రెవెన్యూ డివిజన్లలో అసైన్‌మెంట్ కమిటీ ఆమోదముద్ర వేయగా.. కదిరి డివిజన్‌లో ఇప్పటికే 2960 మందికి 4860 ఎకరాలు సిద్ధం చేసినా ఎంతవీలు ఉంటే అంత అసైన్డ్ భూమిని లాగేసుకునేందుకు ఎంపిక ప్రక్రియ ఇంకా కొనసాగుతుండడం గమనార్హం. దీనిని బట్టి చూస్తే ప్రభుత్వ భూముల పందేరం ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలతో రెవెన్యూ అధికార యంత్రాంగం కుమ్మక్కై, ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా కాజేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా బత్తలపల్లి తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటుతో రెవెన్యూ అధికార యంత్రాంగంలో అలజడి రేగుతోంది.



ఆంధ్రజ్యోతి పుట్టపర్తి

శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు



పుట్టపర్తి రూరల్, జనవరి 25: నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతీయువకులకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు శిక్షణ సంస్థలు, కేంద్ర, రాష్ట్ర, పబ్లిక్ సెక్టారుకు సంబంధించిన ప్రభుత్వ శిక్షణా సంస్థలు, పరిశ్రమల నిర్వాహకులు ఫిబ్రవరి 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగలవారు skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9988853335 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

డీఆర్‌డీఏ వైకేపీ ఉద్యోగుల డిమాండ్

పుట్టపర్తి, జనవరి 25: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డీఆర్‌డీఏ వైకేపీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. పట్టణంలో వారు గురువారం సమావేశమై, సమస్యలపై చర్చించారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనీ, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలనీ, అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలనీ, కారుణ్య నియామకాలు చేపట్టాలనీ తదితర సమస్యలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి డీఆర్వో కొండయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రామేశ్వర్ రెడ్డి, నాయకులు రామమోహన్, శంకర్, గోపాల్ పాల్గొన్నారు.


డీఆర్వో కొండయ్యకు వినతిపత్రం అందజేస్తున్న డీఆర్‌డీఏ వైకేపీ ఉద్యోగులు

గూడు కోసం..

గాంధీజీ విగ్రహం ముందు వృద్ధుడి నిరసన దీక్ష

అసలే నిరుపేద..
తోపుడుబండే జీవనాధారం..
రెక్కాడితేనే డొక్కాడేది..
జీవితమంతా బతుకు పోరాటమే..
ఇక.. వయసు మీరింది..
శరీరం అలసిపోయింది..
నాలుగడుగులు నడవలేని దీనస్థితి..
నెత్తిన ఇంత నీడలేదు..
కాసింత స్థలం ఇచ్చి..
ఇంత గూడు కట్టించి ఇవ్వమని..
పాలకులు, అధికారులను
వేడుకుంటూనే ఉన్నాడు..
ఏ గుండే కరగలేదు..
ఏ ఒక్కరూ కనికరించలేదు..
బతుకు పోరాటంలో అలసి..
వేడుకోలు పర్వంలో ఓడి..
బాపూజీ పాదాల చెంతకు చేరింది..
ఆ పండుటాకు..
వాచిన కాళ్లకు ప్లాస్టర్లు అతికించుకుని..
కన్నీళ్లను కళ్లద్దాల మాటున దాచుకుని..
తన దౌర్భాగ్యాన్ని తలచుకుంటూ..
తల దించుకుని..
నడి బజారులో కూర్చున్నాడు..
ఆ నిర్భాగ్యుడు..
మౌనంగా.. దీనంగా..

ధర్మవరంరూరల్, జనవరి25: 'దయచేసి ఇళ్ల సహాయం చేయండి' అంటూ ఓ వృద్ధుడు పట్టణంలోని గాంధీసర్కిల్‌లో మహాత్మాగాంధీ విగ్రహం ముందు గురువారం నిరసన దీక్ష చేపట్టాడు. పట్టణంలోని 19వవార్డు ఇందిరానగర్‌కు చెందిన గందోడి బాబు తోపుడు బండిపై చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. అతడి భార్య ఇదివరకే మరణించింది. ఉన్న ఇద్దరు కుమారులు వేర్వేరుగా బాడుగ ఇళ్లలో ఉంటున్నారు. వృద్ధుడు గందోడిబాబు ఒంటరిగా అద్దె ఇంట్లో ఉంటున్నాడు. తోపుడు బండి నిర్వహించుకునే సమయంలో వచ్చిన సొమ్ముతో ఇంటి అద్దె కట్టుకునేవాడిననీ, ప్రస్తుతం వయసు పైబడడంతో చేతకావడం లేదని వాపోయాడు. వచ్చే పింఛన్ ఇంటి అద్దెకు కూడా చాలట్లేదని వాపోయాడు. స్థలం ఇచ్చి, ఇల్లు మంజూరు చేయాలని గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ కనికరించలేదని తెలిపాడు. గుడ్‌మార్నింగ్ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వచ్చినపుడు ఆయన వద్ద మొరపెట్టుకున్నానని చెప్పాడు. మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చి, ఇంతవరకు మంజూరు చేయలేదని వాపోయాడు. ఏళ్లుగా ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నాననీ, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరాడు.



గాంధీజీ విగ్రహం ముందు నిరసన దీక్ష చేస్తున్న వృద్ధుడు గందోడి బాబు

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

కలెక్టర్ అరుణ్‌బాబు.. ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

పుట్టపర్తి, జనవరి 25: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమనీ, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. స్థానిక ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మొదట 80 సంవత్సరాలు పైబడిన, దివ్యాంగ ఓటర్లను కలెక్టర్ సన్మానించారు. ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం యువతకు ఓటరు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులన్నింటికంటే ఓటు హక్కు ముఖ్యమైనదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కులం, మతం, డబ్బు చూడకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో 13,91,621 మంది ఓటర్లున్నారని తెలిపారు. ఇందులో పురుషులు 6,94,446 మంది, మహిళలు 6,97,119 మంది, ఇతరులు 63మంది ఉన్నట్లు వివరించారు. నూతనంగా 22,653 మందికి ఓటు హక్కు కల్పించామన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమాధికారి శివరంగ ప్రసాద్, ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్ నవీన్‌కుమార్, ఈడీటీలు మైనొద్దీన్, నరసింహులు, పాల్గొన్నారు.


ఓటరు కార్డు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

తప్పులు.. కుప్పలు తెప్పలు..!

తుది జాబితాలో మృతులు, డబుల్ ఎంట్రీలు

అనంత రూరల్‌లో అర్హుల పేర్లు మాయం


ఓటర్ల తుది జాబితాపై ఎన్నెన్నో అనుమానాలు



● అనంతపురం రూరల్ మండలంలోని కొడిమి పంచాయతీ ప్రజాచైతన్య కాలనీలో కొన్నేళ్లుగా పోతులయ్య నివాసం ఉంటున్నాడు. గతంలో ఎన్‌డీఎఫ్ 1213354 నంబరుతో ఓటరుగా నమోదయ్యాడు. రెండు రోజుల కిందట విడుదలైన తుది జాబితాలో ఆయన పేరు మాయమైంది.



● రాచానపల్లి పంచాయతీ పరిధిలోని 50 పోలింగ్ కేంద్రం పరిధిలో దూదేకుల మహమ్మద్ పేరిట రెండు (ఎన్‌డీఎఫ్ 1765924, ఎన్‌డీఎఫ్ 1774827), హరికృష్ణ కుమ్మర పేరి రెండు (ఎన్‌డీఎఫ్ 2078434, ఎన్‌డీఎఫ్ 2122851) ఎంట్రీలు నమోదయ్యాయి. ఇలా చాలామందికి డబుల్ ఓట్లు వచ్చాయి. ముసాయిదాలోనూ వీరు డబుల్ ఎంట్రీలుగా ఉన్నారు. అయినా తొలగించలేదు.



● మన్నీల గ్రామంలో శోభరాణి అనే మహిళ పేరు గతంలో (ఎన్‌డీఎఫ్ 1545623) ఓటరు జాబితాలో ఉండేది. తుది జాబితాలో ఆమె పేరు మాయమైంది. ఆమె స్థానిక సర్పంచు భార్య కావడం గమనార్హం. ఇదే గ్రామానికి చెందిన ఎ.నారాయణ (ఎన్‌డీఎఫ్1850601), బి.ఆంజనేయులు(ఎన్‌డీఎఫ్1850676) ఏడాది క్రితం మృతిచెందారు. కానీ ఓటరు జాబితాలో అలాగే ఉంచారు. ఈ ఊరిలో సుమారు 50 వరకు మృతుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నట్లు సమాచారం.

అనంతపురం రూరల్, జనవరి 25: ముసాయిదా జాబితాలో పొరపాట్లను సరిదిద్ది.. తుది జాబితాలను విడుదల చేయాల్సిన అధికారులు.. అదే నిర్లక్ష్యాన్ని కొనసాగించారు. డబులు ఎంట్రీలు, మృతుల పేర్లు జాబితాలో బోలెడన్ని కనిపిస్తున్నాయి. కొందరు స్థానికంగానే ఉన్నా, ముసాయిదా జాబితాలో పేరున్నా.. తుది జాబితా వచ్చేలోగా గల్లంతయ్యారు. అనంతపురం రూరల్ మండలంలో ఓటరు తుది జాబితా తయారైన తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తొలగించాల్సినవి అలాగే ఉంచేసి.. పక్కాగా ఉన్నవాటిని తొలగించడం అనుమానాలకు తావిస్తోంది.

తొలగించింది కొన్నే..

ఓటర్ల తుది జాబితా ప్రకారం అనంతపురం రూరల్ మండలంలోని 21 పంచాయతీల పరిధిలో 79,962 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 40,438, ఇతరులు ముగ్గురు ఉన్నారు. అంతకు మునుపు 83 వేల పైచిలుకు ఓటర్లు ఉండేవారు. ఓటరు జాబితా పరిశీలన సమయంలో మండలంలో పది వేలకు పైగా డబుల్ ఎంట్రీలు, రెండు వేలకు పైగా మృతుల పేర్లు ఉన్నట్లు గుర్తించారు. తాజా జాబితా నుంచి మూడు వేల వరకూ పేర్లను తొలగించారు. ఇందులో మృతులు, డబుల్ ఎంట్రీలతోపాటు అర్హులూ ఉన్నారు. దీన్ని బట్టి డబుల్ ఎంట్రీలు, మృతుల పేర్లు వేలాదిగా జాబితాలో ఇంకా ఉన్నాయన్నది స్పష్టమౌతోంది.




రాచానపల్లి పంచాయతీ 50 బూత్‌లో ఉన్న డబుల్ ఓట్లు



మన్నీలలో మరణించినవారి ఓట్లు యథాతథం

చనిపోయినా ఓటర్లుగా నమోదు చేశారు..!



చనిపోయిన వ్యక్తులను తుదిజాబితాలో ఓటరుగా ఉన్న దృశ్యం

బొమ్మనహాళ్, జనవరి 25: తప్పులు లేని ఓటరు జాబితానే ప్రధాన లక్ష్యమని ఎన్నికల అధికారులు పదే పదే చెప్పుకొచ్చారు. అయినా తుది జాబితాలోనూ తప్పులు దొర్లాయి. చనిపోయినా ఓటరు లిస్టులో నుంచి తొలగించలేదు. బొమ్మనహాళ్ మండలం కానాపురం, ఏళంజి గ్రామాల్లో 76 బూత్‌లో వైసీపీ సర్పంచ్‌గా ఉన్న తిమ్మక్క పెన్నంపల్లి గత ఏడాది చనిపోయింది. అయినా ఓటరు లిస్టులో నుంచి తొలగించలేదు. అదేవిధంగా ఎల్‌బీనగర్ గ్రామంలో 85 బూత్‌లో బీ పాలాక్షిరెడ్డి మూడేళ్ల క్రితం చనిపోయాడు. తుది ఓటరు జాబితాలో అయనకు ఓటు ఉన్నట్లు చూపించారు. తప్పులు లేకుండా కొత్త ఓటరు జాబితా తయారు చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేశారా లేదా అన్న అనుమానం వ్యక్తమవుతున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.


ఇక్కడా అవకతవకలే

● ఓటర్ల లిస్టులో డబుల్ ఎంట్రీలు, వలస వెళ్లిన వారి పేర్లు అలాగే.. ● బీఎల్వోల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందంటున్న ప్రతిపక్షాలు



జాబితాలో అలాగే ఉన్న షిఫ్టింగ్ ఓట్లు


ధర్మవరంరూరల్, జనవరి 25: ఓటర్ల తుది జాబితాలో కూడా అవకతవకలకు తావిచ్చారు. ఇంటింటా పకడ్బందీ సర్వే చేసి డబుల్ ఓట్లు, షిఫ్టింగ్ ఓట్లును తొలగించి తప్పుల్లేని జాబితా ఇవ్వాలని బీఎల్వోలకు అధికారులు గట్టి ఆదేశాలు ఇచ్చారు. అయినా తుది జాబితాలో మళ్లీ తప్పులే వచ్చాయి. వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే ధర్మవరం పట్టణంలోని గుట్టకిందపల్లిలో 264పోలింగ్ కేంద్రం సీరియల్ నెంబర్ 113లో మేకల ప్రియవర్ధన్ ఓటు ఉంది. అయితే అదేబూత్‌లో 22వ సీరియల్ నెంబర్‌లోనూ మేకలప్రియవర్ధన్ పేరు వచ్చింది. దీంతో డబుల్‌ఎంట్రీగా నమోదైంది. అదేవిధంగా పూజిత బుట్ర అనే మహిళ ఓటు 262వ పోలింగ్‌కేంద్రంలోని 1488వ సీరియల్ నంబర్‌లో ఉంది. మళ్లీ అదేబూత్‌లోని 1486వ సీరియల్ నెంబర్‌లో ఆమె పేరు కనిపించింది. అంతేకాకుండా పట్టణంలోని తారకరామాపురంలో నివాసం ఉండే గొట్లూరు వరలక్ష్మీ, గొట్లూరు హర్షవర్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డిల ఓట్లు 1486వ పోలీస్‌కేంద్రంలోని 1231, 1232, 1233వ సీరియళ్ల నంబర్లలో ఉన్నాయి. వారంతా నాలుగేళ్ల క్రితం మరోచోట అయిన గీతామందిరానికి వలస వెళ్లారు. వారి ఓట్లు మాత్రం అక్కడికి షిఫ్టింగ్ కాలేదు. ఇలా డబుల్ ఓట్లు, సిఫ్టింగ్ ఓట్లు అలాగే ఉంచడంతో ప్రతిపక్షాల నాయకులు బీల్వోలపై మండిపడుతున్నారు. వారు నిర్లక్ష్యంతోనే ఇలా జరిందంటూ ఆరోపిస్తున్నారు.



ముదిగుబ్బ మండలం ఎనుములవారిపల్లిలో మృతి చెందిన వ్యక్తి ఓటును తొలగించని దృశ్యం

ముదిగుబ్బ: మండలంలోని ఎనుములవారిపల్లిలో ఓటర్ల తుదిజాబితా తప్పుల తడకగానే ప్రచురితమైంది. మలకవేముల పంచాయతీ ఎనుములవారిపల్లి పోలింగ్ కేంద్రం 80లో వెంకటరామన్న గత మూడు నెలల క్రితం మృతి చెందారు. ఈ విషయం స్థానిక నాయకులు.. బీఎల్వోలకు సమాచారం ఇచ్చారు. అయినా ఓటరుజాబితాలో అతడి పేరు తొలగించలేదు. అదే గ్రామంలో అరవేటి శ్వేత పేరుతో డబుల్ ఎంట్రీ ఉన్నాయి. ఓటర్ల తుది జాబితా తప్పుల తడకగా రావడంపై బీఎల్వోల నిర్లక్ష్యమేనని ప్రతిపక్ష పార్టీలనాయకులు పేర్కొంటున్నారు. మృతి చెందిన వారి ఓట్లు, డబుల్ ఎంట్రీలను తొలగించలేదని ఆరోపిస్తున్నారు.

ఆత్మలు ఎలా ఓటు వేస్తాయో!



మృతిచెందినా ఓటరు జాబితాలో ఉన్న పేర్లు

పదేళ్ల క్రితమే విదేశాలకు వెళ్లినా ఇప్పటికీ జాబితాలో ఉన్న దృశ్యం

3 నెలలు కసరత్తు చేసినా తొలగని పేర్లు

హిందూపురం, జనవరి 25 : ఓటర్ల జాబితాలో తప్పులున్నాయని ఆరు నెలలుగా ప్రతిపక్షాలు కోడై కూస్తున్నాయి. జాబితాలో తప్పులు చాలా ఉన్నాయని నెత్తినోరు బాదుకున్నా క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోలేదు. దాని ఫలితంగా ఐదారేళ్ల క్రితం చనిపోయిన వారి పేర్లు, పదేళ్ల క్రితం దేశం విడిచి వెళ్లి విదేశాల్లో స్థిరపడివారి పేర్లు జాబితాలో పదిలంగా ఉన్నాయి. దీనిని బట్టిచూస్తే అధికారులు తప్పొప్పులు ఎలా సరిచేశారో ఇట్టే అర్థమవుతుంది. హిందూపురంలో మృతులకు మరోసారి జాబితాలో చోటు కల్పించారు. వారు మృతులని క్షేత్రస్థాయిలో అధికారులకు సమాచారం అందించినా పట్టనట్లు వ్యవహరించి ఓటర్ల జాబితాను తప్పుల తడకగా మార్చారు. హిందూపురం పట్టణంలో ప్రతి వార్డులో కనీసం 20 నుంచి 30 మంది మృతిచెందినవారు ఓటర్ల జాబితాలో ఉండటం విశేషం. మూడు నెలలుగా మృతిచెందిన వారి పేర్లు తొలగించాలని అధికారులకు దరఖాస్తు చేసినా, పరిశీలించి పేర్లు మాత్రం తొలగించలేదు.

మృతిచెందిన వారి ఓట్లు అలాగే..

పట్టణంలోని తిప్పరాజు, ప్రమీళమ్మ నాలుగేళ్ల క్రితం మృతిచెందారు. కానీ నేటికీ వారి పేర్లు జాబితాలో ఉన్నాయి. రంగనాథ ప్రసాద్ అనే ఓటరు మూడేళ్ల క్రితమే చనిపోయాడు. అయినా ఇప్పటికీ అలాగే ఉంది. అదేవిధంగా బెంగళూరు రోడ్డులో నివాసముంటున్న గంగలక్ష్మి, లీలావతమ్మలు కూడా చనిపోయారు. శ్రీనివాసరావు, కస్తూరీబాయి దంపతులు పదేళ్ల క్రితమే ఇతర దేశంలో స్థిరపడ్డారు. అయినా వారి పేర్లు ఇప్పటికే ఓటరు జాబితాలో ఉండటం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఆధారాలు ఇవ్వని వారి ఓట్లు తొలగించడానికి వీలులేదన్నారు. అయినా కొంతమంది అర్హులు ఉంటే తొలగించడం మరో విశేషం.

3 నెలలు కసరత్తు.. చేసిందేమిటి?

ఓటరు జాబితాలో తప్పొప్పులను సరిదిద్దేందుకు 3 నెలల పాటు కసరత్తు చేశారు. అయినా ఓటరు జాబితా మాత్రం తప్పుల తడకగానే ఉంచారు తప్ప అందులో ఎలాంటి మార్పులు చేయకపోవడం దురదృష్టకరం. మూడు నెలల్లో బీఎల్‌ఓలు ఏ ఇంటికి ఏ తప్పు సరిచేశారో ఇప్పటికీ చెప్పకపోవడం మరో వింత. తప్పనిసరిగా మృతిచెందిన వారి ఓట్లు తొలగించాలని అర్హత ఉన్నవారివి ఒకసారి జాబితాలో లేకపోతే వారిని చేర్చాలన్నా క్షేత్రస్థాయిలో అవి పట్టించుకోకపోవడంతో ఓటర్ల జాబితా తప్పుల తడకగా తుదిజాబితా విడుదల చేశారు.

వెయ్యి దాకా మృతుల ఓట్లు

హిందూపురం పట్టణంలోని 38 వార్డుల్లో వెయ్యి దాకా మృతిచెందిన వారి ఓట్లు తుది జాబితాలో వచ్చినట్లు తెలుస్తోంది. మూడు నెలల క్రితం మృతిచెందిన వారి ఓట్లు తొలగించాలని సుమారు ఐదారు వందల మంది దరఖాస్తు చేసుకున్నా అధికారులు మాత్రం దరఖాస్తులు స్వీకరించారుతప్ప ఓట్లు తొలగించలేదు. దీనిని బట్టి అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐల బదిలీ

పుట్టపర్తిరూరల్, జనవరి 25: ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్‌ఎన్ అమ్మిరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా శ్రీసత్యసాయిజిల్లా పోలీసుకార్యాలయంలో వీఆర్‌లో ఉన్న పీ. రాజారమేష్‌ను కొత్తచెరువు యూపీఎస్‌కు, కదిరి అర్బన్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న డీవీ నారాయణరెడ్డిని అనంతపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు, అనంతపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సీ.వెంకటేష్ నాయక్‌ను సీసీఎస్ అనంతపురానికి, శ్రీసత్యసాయిజిల్లా పోలీసుకార్యాలయంలో వీఆర్‌లో ఉన్న జే.హేమంత్ కుమార్‌ను సోషల్ మీడియా, సైబర్‌క్రైం సెల్‌కు బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో భారీగా ఎస్‌ఐల బదిలీ

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్రఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శ్రీసత్యసాయి జిల్లాలో భారీగా ఎస్‌ఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్‌ఎన్ అమ్మిరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా రామగిరి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న జనార్దన్ నాయుడును జిల్లాకేంద్రంలోని పోలీసుకార్యాలయం సీసీఎస్‌కు, కియ పోలీసుస్టేషన్ నుంచి రమేష్‌బాబును నల్లమాడ స్టేషన్‌కు, బుక్కపట్నం స్టేషన్ నుంచి కే నరసింహుడును పట్నం పోలీసు స్టేషన్‌కు, చెన్నేకొత్తపల్లి స్టేషన్ నుంచి శ్రీధర్‌ను నంబులపూలకుంట స్టేషన్‌కు బదిలీ చేశారు. అలాగే సీసీఎస్ పుట్టపర్తి పోలీసు స్టేషన్ నుంచి వెంకటరమణయ్యను హిందూపురం టూటౌన్‌కు, ఓబుళదేవరచెరువు స్టేషన్ నుంచి మల్లికార్జునరెడ్డిని కనగానిపల్లి స్టేషన్‌కు, గోరంట్ల అర్బన్ స్టేషన్ నుంచి ఇస్మాయిల్‌ఖాన్‌ను జిల్లా వీఆర్‌కు బదిలీ చేశారు. సీసీఎస్ నుంచి నారాయణను జిల్లా స్పెషల్‌బ్రాంచ్‌కు, కదిరి స్టేషన్ నుంచి వెంకట బసయ్యను జిల్లా పోలీసుకార్యాలయ పీసీఆర్‌కు, నంబులపూలకుంట స్టేషన్ నుంచి వెంకటరమణను జిల్లాపోలీసుకార్యాలయ వీఆర్‌కు, కదిరి పట్టణ స్టేషన్ నుంచి మక్బూల్‌బాషాను జిల్లాపోలీసుకార్యాలయం వీఆర్‌కు, హిందూపురం వన్‌టౌన్ స్టేషన్ నుంచి భాస్కర్‌ప్రసాద్‌రాజును జిల్లాపోలీసు కార్యాలయ వీఆర్‌కు బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంసీఏ పరీక్షా ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 25: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎంసీఏ విద్యార్థుల పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్ సత్యనారాయణ గురువారం విడుదల చేశారు. ద్వితీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్ పరీక్షలు 22న ముగిశాయన్నారు. త్వరతగతిన మూల్యాంకణ ప్రక్రియను పూర్తిచేసి ఫలితాలను విడుదల చేశామన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం కళాశాలలోని అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలన్నారు.

చేపల కూర వండే విషయమై తగాదా..

అన్నను హతమార్చిన తమ్ముడు




సంజీవులు (ఫైల్)

తనకల్లు, జనవరి 25: చేపల కూర వండే విషయమై తలెత్తిన తగాదాతో సొంత అన్నను తమ్ముడే హత్య చేశాడు. మండలంలోని నడింకుంటపల్లిలో బుధవారం రాత్రి సంజీవులు (30)ను సొంత తమ్ముడు వెంకటేష్ మందంపాటి చెక్కతో బాది, హత్య చేశాడు. ఇన్‌చార్జి ఎస్‌ఐ లింగన్న తెలిపిన వివరాల మేరకు.. సంజీవులు, వెంకటేష్ కుటుంబాలు కలిసే ఉండేవి. బుధవారం సాయంత్రం సంజీవులు గ్రామ సమీపాన ఉన్న చెరువులో చేపలు పట్టి, తీసుకొచ్చాడు. భార్య హేమలత ఊరికెళ్లడంతో తమ్ముడు వెంకటేష్ భార్య పవిత్రకు చేపల కూర చేయాలని చెప్పాడు. రాత్రి పొద్దుపోయిందనీ, గురువారం వండి ఇస్తానని ఆమె చెప్పింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సంజీవులు.. తనకు చేపలకూర కావాలని పట్టుబట్టాడు. మసాలా తయారు చేసి ఇస్తే, తానే వండుకుంటానన్నాడు. దీంతో ఆమె మసాలా తయారు చేసి, ఇచ్చింది. చేపలకూర వండుకుంటూ సంజీవులు.. తమ్ముడు వెంకటేష్‌ను నానా దుర్భాషలాడసాగాడు. మిద్దెపెపడుకున్న వెంకటేష్ ఆ మాటలు విని ఆగ్రహంతో రాత్రి 10గంటల సమయంలో ఇంట్లోకి వచ్చాడు. చేతికి దొరికిన మందంపాటి చెక్కతో అన్న తలపై బాదాడు. దీంతో సంజీవులు అక్కడికక్కడే మృతిచెందారు. విషయం బయటకు పొక్కకుండా వెంకటేష్ మిన్నకుండిపోయాడు. నానమ్మ వచ్చి సంజీవులు ఏదని తలుపు తీసి చూడగా, రక్తపు మడుగులో మృతిచెంది పడి ఉండడాన్ని చూసి బోరున విలపించింది. పోలీసులకు సమాచారం అందించారు. కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, తనకల్లు ఇన్‌చార్జీ ఎస్‌ఐ లింగన్న హత్యాస్థలాన్ని పరిశీలించారు. సంజీవులు అత్త నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంజీవులుకు సంతానం లేదు.


గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అనంతపురం క్రైం, జనవరి 25: స్థానిక బళ్లారి బైపాస్‌లోని సర్వీస్‌రోడ్డు పక్కన ఉన్న వైన్‌షాపు ఎదుట ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని నాలుగో పట్టణ పోలీసులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. అనారోగ్యంతో అతను మరణించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 9346010581, 9346917088ను సంప్రదించాలని సూచించారు.




అభిషేక్ (ఫైల్)

ప్రేమ.. పెళ్లి.. చావు..!



ఉమ్మడి జిల్లాలో మూడు ఆత్మహత్యలు

మనిషి జీవితం వందేళ్లు..! బాల్యం మొదలు వృద్ధాప్యం వరకూ ఎన్నెన్నో అనుభవాలు ఎదురవుతాయి. కొన్ని మోదం.. మరికొన్ని ఖేదం..! అవన్నీ జీవితంలో భాగమే. అవే జీవితం కాదు..! అన్నింటినీ ఎదుర్కొంటూ ముందుకు సాగాలి. ఆ క్షణంలో ఎదురైన కష్టం జీవితాంతం ఉంటుందని కొందరు అనుకుంటారు. కానీ కాలం అన్ని కష్టాలనూ గట్టెక్కిస్తుందని, గాయాలను మాన్పిస్తుందని, మునుముందు రెట్టింపు ఆనందం ఎదురుచూస్తుంటుందని తెలియదు వారికి. అలాంటివారు క్షణికావేశంలో అర్ధంతరంగా తనువు చాలిస్తుంటారు. బలవన్మరణం దేనికీ పరిష్కారం కాదు..! ప్రేమ.. పెళ్లి విషయంలో ఎదురైన చేదు అనుభవాలను ఎదుర్కొనలేక ఉమ్మడి జిల్లాలో గురువారం ముగ్గురు ఉసురు తీసుకున్నారు. తల్లిదండ్రులకు జీవితకాలపు శిక్షను విధించారు.



కుందుర్పి మండలం కరిగానపల్లి గ్రామానికి చెందిన సోమనాథ్, రుక్మిణి దంపతుల కుమారుడు అభిషేక్(17) కళ్యాణదుర్గం బోరంపల్లిలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థి. ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆమెతో పెళ్లి చేయాలని తల్లిదండ్రులను కోరాడు. 'అప్పుడే పెళ్లేమిటి? బాగా చదువుకో.. మంచి ఉద్యోగం సంపాదించుకో.. అప్పుడు చూద్దాం..' అన్నారు తల్లిదండ్రులు. ఈ విషయమై నాలుగు రోజుల క్రితం తల్లిదండ్రులు అభిషేక్‌కు నచ్చజెప్పారు. బాగా చదువుకుని, మంచి ఉద్యోగం తెచ్చుకుని.. జీవితంలో స్థిరపడితే తల్లిదండ్రులు కొడుకు ప్రేమను ఎందుకు కాదంటారు..? కానీ ఆ దిశగా ఆలోచించలేదు కొడుకు. తన ప్రేమ ఎక్కడ దూరమవుతుందోనని ఆందోళన చెందాడు. కాలేజీకి వెళ్లొచ్చిన తరువాత బుధవారం సాయంత్రం తల్లిదండ్రులతో కాసేపు మాట్లాడాడు. ఆ తరువాత సెల్‌ఫోన్‌ను తల్లికి ఇచ్చి, బైక్‌పై బయటకు వెళ్లిపోయాడు. రాత్రికి ఇంటికి కాలేదు. స్నేహితులతో ఎక్కడైనా ఉంటాడని అనుకున్నారు. పంటకు నీరు పెట్టేందుకుఉ గురువారం ఉదయం సోమనాథ్ పొలానికి వెళ్లాడు. అక్కడ చింత చెట్టుకు ఉరివేసుకున్న కుమారుడు కనిపించాడు. 'ఏమి తక్కువ చేశాం నాయనా.. ఇంత పనిచేశావు..' అని తల్లిదండ్రులు గుండెలు పగిలేలా ఏడ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. **- కుందుర్పి**

పెళ్లి కాలేదని..

సోమందేపల్లి మండలం మండ్లి గ్రామానికి చెందిన నవీన్ (20) గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కియ అనుబంధ పరిశ్రమలో నవీన్ కార్మికుడు. ఇతనికి ఆరోగ్యం సరిగాలేదని, దీనికి తోడు పెళ్లికాలేదని మనోవేదన చెందేవాడని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ క్రమంలో తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడని తెలిపారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. **- పెనుకొండ టౌన్**



ఆత్మహత్య చేసుకున్న నవీన్

బాలికా వధు

అనంతపురం నగరంలోని బసవతారక నగర్‌కు చెందిన హారిక వయసు పద్నాలుగేళ్లు. ఇంత చిన్న వయసులో, అదే కాలనీకి చెందిన కిరణ్ అనే యువకుడిని ప్రేమించింది. తల్లిదండ్రులను ఎదిరించి పెళ్లి చేసుకుంది. దీంతో తల్లిదండ్రులు హారికను దూరం పెట్టారు. ఇది జరిగి కేవలం నాలుగు నెలలు అయ్యింది. అదే కాలనీలో కాపురం పెట్టారు. క్లీనర్ పనిచేసే కిరణ్ తాగుడుకు బానిస అయ్యాడు. రోజూ హారికతో గొడవపడేవాడు. తన జీవితం ఇలా అయ్యిందేమిటని ఆ బాలిక బుధవారం రాత్రి తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. బాల్య వివాహం నేరం. హారిక విషయంలో తల్లిదండ్రులు చట్టబద్ధంగా వెళ్లినా కాపాడుకోగలిగేవారు. తప్పు జరిగిపోయింది. తన కష్టం ఇదీ.. అని తల్లిదండ్రులను ఆశ్రయించా ఆమె బతికేది. భవిష్యత్తు మరోలా ఉండేది. హారికది సాంకేతికంగా ఆత్మహత్యే అయినా.. ఆ పరిస్థితులకు కారణమైనవారు ఆమెను బలిగొన్నట్లే కదా..! **- అనంతపురంక్రైం**

రైలుకిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ధర్మవరం, జనవరి 25: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో సోలాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తుతెలియనివ్యక్తి మృతి చెందినట్లు రైల్వే జీఆర్‌పీ ఎస్‌ఐ గోపీకుమార్ తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించి ఇతను ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలుస్తోందన్నారు. మృతుడికి 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉంటుందన్నారు. స్కైబ్లూరంగు షర్టు ధరించి ఉన్నాడన్నారు. కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్‌ఐ చెప్పారు. మృతుడిని గుర్తు పట్టిన వారు 9440627640, 9440552808 , 08559-226333కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

మరో ముగ్గురిపై వేటు

ధర్మవరం భూబాగోతంలో ఇద్దరు వీఆర్వోలు, వీఆర్ఏ సస్పెన్షన్..

ఇదివరకే ఇన్‌చార్జి తహసీల్దార్‌పై చర్యలు


ధర్మవరం, జనవరి 25: ధర్మవరం పరిధిలో భూఅక్రమాల వ్యవహారంలో మరో ముగ్గురు రెవెన్యూ సిబ్బందిపై వేటు పడింది. ఇప్పటికే భూబాగోతంలో బత్తలపల్లి తహసీల్దార్, ధర్మవరం ఇన్‌చార్జిగా కూడా వ్యవహరిస్తున్న యుగేశ్వరీదేవిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అక్రమాలపై లోతుగా విచారణ చేసిన అధికారులు ఇద్దరు వీఆర్వోలు, వీఆర్‌ఏ పాత్ర కూడా ఉందని తేల్చి, వారిని కూడా సస్పెండ్ చేశారు. సస్పెండైన వారిలో ధర్మవరం మండలం గొట్లూరు వీఆర్వో నజీర్, పోతుకుంట వీఆర్వో వెంకట్రామిరెడ్డి, కట్టకిందపల్లి వీఆర్‌ఏ నారాయణస్వామి ఉన్నట్టు రెవెన్యూవర్గాల ద్వారా తెలిసింది. పోతుకుంట వీఆర్వో వెంకటరామిరెడ్డి.. కుణుతూరు ఇన్‌చార్జిగా ఉంటూ పోతుకుంట, కుణుతూరులో ఇళ్లపట్టాలు, భూపంపిణీ, మ్యుటేషన్‌లో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే సస్పెండ్ చేసినట్లు తెలిసింది. గొట్లూరు వీఆర్వో నజీర్.. ధర్మవరం పట్టణ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ భారీఎత్తున అవకతవకలకు పాల్పడినట్లు కలెక్టరేట్‌కు ఫిర్యాదులు అందడంతో ఆయనపై కూడా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. వీరికి సహకరించిన కట్టకిందపల్లి వీఆర్‌ఏ నారాయణస్వామిని కూడా సస్పెండ్ చేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. వీరంతా కలిసి అక్రమాలకు పాల్పడడం గమనార్హం. ఈ విషయంపై ఆర్డీఓ రమేశ్‌రెడ్డిని అడగ్గా.. సస్పెన్షన్ ఉత్తర్వులు అందాయనీ, పరిశీలించి చెబుతానంటూ దాటవేశారు.

ఒక ప్రశ్నపత్రం బదులు మరొకటి..!

అయోమయంలో పడిన విద్యార్థులు
ఖంగుతిన్న ఇన్విజిలేటర్
తప్పు సరిదిద్దుకున్న యూనివర్శిటీ విభాగం
గంట ఆలస్యంగా ప్రారంభమైన పరీక్ష

తాడిపత్రి, జనవరి 25: పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన ఎస్‌కే యూనివర్సిటీ బీఈడీ మొదటి సంవత్సరం సెమ్ -2 పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 300మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండవ సెమ్‌లో మూడవ పరీక్ష అయిన క్లాస్‌రూం మేనేజ్‌మెంట్ ప్రశ్నపత్రానికి బదులు బుధవారం జరిగిన లెర్నింగ్ అండ్ టీచింగ్ ప్రశ్నపత్రాన్ని విద్యార్థులకు అందజేశారు. ముందురోజే ఈ పరీక్ష పత్రం రాసి ఉండడంతో ఖంగుతిన్న విద్యార్థులు జరిగిన పొరపాటును ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆశ్చర్యపోయిన ఇన్విజిలేటర్ ప్రశ్నపత్రాన్ని పరీక్ష నిర్వాహక సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లారు. ప్రిన్సిపాల్ యూనివర్సిటీ అధికారికి ఫోన్‌చేసి జరిగిన పొరపాటును వివరించారు. వారు వెంటనే క్లాస్‌రూం మేనేజ్‌మెంట్ ప్రశ్నపత్రాన్ని వాట్సాప్ ద్వారా ప్రిన్సిపాల్‌కు పంపగా జిరాక్స్ చేసి విద్యార్థులకు అందించారు. ఉదయం 10గంటలకు జరగాల్సిన పరీక్ష 11గంటలకు ప్రారంభమైంది.

ఉత్తమ కార్యదర్శి.. కర్ణాటక మద్యంతో దొరికాడు..!





కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తెస్తూ.. చిలమత్తూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ సెబ్ పోలీసులకు పట్టుబడ్డారు. కొడికొండ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆయన దొరికిపోయారని సెబ్ సీఐ రాజశేఖర్ తెలిపారు. తన వాహనంలో పెద్దఎత్తున కర్ణాటక మద్యాన్ని తీసుకువచ్చారని, వాహనాన్ని సీజ్ చేసి హిందూపురం సెబ్ స్టేషన్‌కు తరలించామని ఆయన తెలిపారు. కాగా, గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇచ్చే ఉత్తమ పురస్కారానికి మధుసూదన్ ఎంపికయ్యారు. పురస్కార గ్రహీతల జాబితాలో ఆయన నంబరు 332. గణతంత్ర దినోత్సవాల సందర్భంగా శుక్రవారం మద్యం దుకాణాలను మూసివేస్తారు. ఈ నేపథ్యంలో ఆయన సెలబ్రేట్ చేసుకునేందుకు ముందుగానే మద్యం తెచ్చారా..? లేక ఈ దందా నడిపిస్తున్నారా..? అన్న చర్చ జరుగుతోంది. **- చిలమత్తూరు**

15లోగా ఈక్రాప్ నమోదు పూర్తి చేయాలి : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి, జనవరి 25: రబీలో సాగుచేసిన పంటలకు ఫిబ్రవరి 15వ తేదీలోపు ఈక్రాప్ నమోదు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఇందు లో జేసీ పాల్గొని మాట్లాడారు. ప్రభు త్వం మంజూరు చేసిన కౌలుకార్డు రైతులకు బ్యాంకు రుణాలు ఇప్పించడానికి అధికారులు కృషి చేయాలన్నారు. అలాగే పాడి పరిశ్రమకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని ఆదేశించారు. జిల్లాలో కృషి విజ్ఞానకేంద్రం ఏర్పాటుకు స్థలసేకరణకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు సకాలంలో అందించాలన్నారు. వ్యవసాయాధికారి సుబ్బారావు మాట్లాడుతూ రబీలో ఈక్రాప్ నమోదు ఇప్పటికే 93శాతం పూర్తి చేశామని తెలిపారు. ఎరువల కొరత లేదని, రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ రమణారెడ్డి, పట్టుపరిశ్రమ, ఉద్యానశాఖల అధికారి చంద్రశేఖర్, పశుసంవర్ధ శాఖ అధికారి సుబ్బరాజు, శాస్త్రవేత్త సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ధర్నా

కొత్తచెరువు, జనవరి 25: తమ సమస్యల్ని పరిష్కరించాలంటూ సత్యసాయి తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో గురువారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట విశ్రాంత ఉద్యోగులు ధర్నా చేపట్టారు. పలువురు మాట్లాడుతూ.. క్వాంటమ్ పెన్షన్‌ను 70 సంవత్సరాలకు 10శాతం, 75 సంవత్సరాలకు 15శాతం పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని, హెల్త్ కార్డుకు అన్నివ్యాధులకు వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను రూ.5లక్షలకు పెంచాలని, 12వ పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రామాంజునేయులరెడ్డికి అందజేశారు. ధర్నాలో సంఘం అధ్యక్షుడు రామకృష్ణయ్య, సెక్రెటరీ నాగార్జునశెట్టి, కోశాధికారి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సమావేశానికి ఎమ్మెల్యే దూరం

మడకశిరటౌన్, జనవరి 25: నియోజకవర్గంలో వైసీపీ సమన్వయకర్తగా ఈరలక్కప్పను ప్రకటించిన అనంతరం గురువారం మొదటిసారిగా పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో వైసీపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ అబ్జర్వర్ అశోక్‌బాబు మడకశిరకు రావడంతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, ఆయన వర్గం దూరంగా ఉంది. ఎమ్మెల్యే విజయవాడకు వెళ్లారని, ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉరవకొండ పర్యటన సందర్భంగా కలిసిన సమయంలో విజయవాడకు రావాలని సూచించడంతో వెళ్లినట్లు ఆయన సన్నిహితుల ద్వారా తెలిసింది. దీంతో సమావేశం జరుగుతున్నా ఆయన వర్గం ఇందులో పాల్గొనలేదు. మొదటి సారి సమావేశంలో అసమ్మతి బయటపడిందని ఆపార్టీ నాయకులు చర్చించుకోవడం కనిపించింది. హిందూపురం వైసీపీ పార్లమెంటు అభ్యర్థి శాంత, మాజీ మంత్రి హెచ్.బి.నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వెటీప్రభాకర్‌రెడ్డి, కుంచిటిగ వక్కలిగ ఛైర్‌పర్సన్ నళిని హాజరయ్యారు.

న్యాయం కోసం..

● ప్రియుడి ఇంటి ఎదుట యువతి మౌనదీక్ష



ప్రియుడి ఇంటి ఎదుట మౌనదీక్షచేస్తున్న యువతి

పుట్టపర్తిరూరల్, జనవరి 25: ప్రియుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో ఓ యువతి న్యాయం కోసం బంధువులతో కలిసి అతడి ఇంటి ముందు మౌనదీక్షకు దిగింది. ఆమె బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సాయినగర్‌కు చెందిన గగన, యశ్వంత్‌కుమార్ మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అతడు పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మించాడు. ఆమె కూడా అతడిని బాగా నమ్మింది. అయితే ఒక్కసారిగా అతడు ఆమెకు మొహం చాటేశాడు. పెళ్లి చేసుకోమని అడిగితే ఏదో సాకు చెబుతూ తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో ఆవేదన గురైన ఆయువతి ప్రేమికుడి ఇంటి ముందు బంధువులతో కలిసి మౌనదీక్షకు దిగింది. న్యాయం జరిగేవరకు ఇక్కడే ఉంటానని భీష్మించింది. అయితే విషయంతెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి ప్రేమికులిద్దరినీ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి

మడకశిరటౌన్, జనవరి 25: నగర పంచాయతీ చౌటిపల్లి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద గురువారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. వెంటనే కాలనీవాసులు చూసి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. కాలనీ వైపు నుంచి కొండ ప్రాంతానికి వెళుతున్న సమయంలో పెనుకొండ-మడకశిర ప్రధాన రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు కాలనీవాసులు తెలిపారు.

విద్యుత్ సమస్యలపై రైతుల ధర్నా

ముదిగుబ్బ, జనవరి 25: విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మండలంలోని రాళ్లఅనంతపురం విద్యుత్ ఫీడర్ కింద ఉన్న నలాయకుంటపల్లి, యాకర్లకుంటపల్లి, నల్లచెర్లోపల్లి, ముక్తాపురం, ముక్తాపురం తండాలకు చెందిన రైతులు గురువారం సీపీఐ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ ముక్తాపురం పంచాయతీలోని గ్రామాలకు చెందిన సుమారు 500 ల ఎకరాలలో రబీ సీజన్‌లో రైతులు వేరుశనగ, ఇతర కూరగాయ పంటలు సాగు చేశారన్నారు. గత కొన్ని రోజుల నుంచి మూడునాలుగు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా అవుతోందని, దీనికి తోడు లోఓల్టేజీ సమస్య అధికంగా ఉండడంతో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందన్నారు. పంటలకు సకాలంలో నీరందించలేని దుస్థితిలో రైతులు ఉన్నారని వాపోతున్నారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా.. పట్టించుకునే వారే లేదని మండిపడ్డారు. రైతన్నలు గత్యంతరం లేక రోడ్ల మీదకు వచ్చి ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు విద్యుత్ సమస్య, లోఓల్టేజీ సమస్య లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, రైతులు హరికృష్ణ, అమర, రియాజ్, రామాంజి, పుల్లప్ప, నూరి, హరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు కేంద్ర పురస్కారం



విజయకుమార్‌నాయక్

తనకల్లు, జనవరి 25: మండలంలోని బొంతలపల్లి పశు వైద్యశాలలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.విజయ్‌కుమార్‌నాయక్ అందించిన ఉత్తమ సేవలకు గాను కేంద్ర ప్రభుత్వ పురస్కారానికి ఎంపికయ్యారు. ఢిల్లీలో రిపబ్లిక్‌డే వేడుకల్లో ఇందుకు సంబంధించిన ప్రశంసాపత్రం అందుకోనున్నట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తనను కేంద్ర పురస్కారానికి ఎంపిక చేసిన తమ శాఖ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాలం చెల్లిన చెక్‌బుక్కుల దహనం

కొత్తచెరువు, జనవరి 25: కాలం చెల్లిన చెక్‌బుక్కులను జిల్లా సబ్‌ట్రెజరీ అధికారిణి నా గమల్లిక ఆధ్వర్యంలో గురువా రం సిబ్బంది మండల కేంద్రంలోని సబ్‌ట్రెజరీ కార్యాలయం ఎదుట దహనం చేశారు. ఈ సందర్భంగా అధికారిణి మాట్లాడుతూ.... గతంలో చెక్కుల ద్వారా సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు లావాదేవీలు చేసుకునే వారన్నారు. అయితే ప్రభుత్వం సీఎఫ్‌ఎంఎస్ ద్వారానే లావాదేవీలు చేయాలని నిబంధన పెట్టిందన్నారు. దీంతో ఈ చెక్‌బుక్కుల ద్వారా లావాదేవీలు రద్దయ్యాయన్నారు. కనుక జిల్లాలోని 7 సబ్‌ట్రెజరీ కార్యాలయాల్లోని 7,144 చెక్‌బుక్కులను దహనం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి హేమంత్‌రెడ్డి, తహసీల్దార్ రామాంజినేయరెడ్డి, ఎస్టీఓలు , సిబ్బంది పాల్గొన్నారు.



చెక్‌బుక్కులను దహనం చేస్తున్న అధికారులు

టీడీపీ విజయానికి సైనికుల్లా పని చేయాలి

● పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి పల్లె సూచన



పుట్టపర్తి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి, జనవరి 25: వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడి పనిచేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలకు చెందిన టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీన ర్ల సమావేశం జరిగింది. ఇందులో పల్లె మాట్లాడుతూ వైసీపీ అవినీతి పాలనకు అంతం పలికే సమయం ఆసన్నమైందన్నారు. టీడీపీ విజయం కోసం ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. కొత్త ఓటరు జాబితా వచ్చిందని, ఇందులో పేర్లు ఉన్నాయో లేదో సరిచూసుకుని తెలపాలన్నారు. కొత్త ఓటర్లు నమోదు కాకపోతే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. అనంతరం క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ ఇన్‌చార్జిలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, నాయకులు సామకోటి ఆదినారాయణ, విజయకుమార్, రామక్రిష్ణ, ము రారి, కేశవ, లావణ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని వెంకటసాయి ఐటీఐలో టీడీపీ ఇంటిగ్రేటెడ్ శిక్షణ జరిగింది. ఇందులో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ సోషల్ మీడియా వేదికగా వైసీపీ చేస్తున్న అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను బూత్‌కన్వీనర్లు, కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధనాలను ఎండగట్టాలన్నారు. టీడీపీ యాప్‌ను ఉపయోగించి ఎంత చిన్న సమస్యనైనా త్వరగా పార్టీలోని అగ్రనాయకులకు చేరేలా చూడాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి అందరూ సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీఎస్ పార్లమెంటు కోఆర్డినేటర్ మనోహర్‌నాయుడు, పోల్ మేనేజ్‌మెంట్ పార్లమెంటు కోఆర్డినేటర్ వెంకటరమణ, ఐటీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి వల్లపు సోమశేఖర్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణతోపాటు ఓడీసీ, నల్లమాడ, అమడగూరు మండలాల కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు హక్కు పొందాలి: ఆర్డీఓ



ధర్మవరంలో ఓటు హక్కుపై ర్యాలీ ..



కదిరిలో ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ధర్మవరం, జనవరి 25: అర్హులందరూ ఓటుహక్కును పొంది.. ఓటు అనే ఆయుధంతో సరైన నాయకుడిని ఎన్నుకోవాలని, అప్పుడే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆర్డీఓ రమేశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలో గురువారం అధికారులు జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి కాలేజీసర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఆర్డీఓ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందాలన్నారు. దేశభవిష్యత్తును మార్చే శక్తి ఓటు అనే ఆయుధానికే ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ కతిజన్ కుప్రా, టీపీఓ సాయిప్రసాద్, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ నబీరసూల్,' సీతారామయ్యకళాశాల కరెస్పాండెంట్ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని, దేశ భవిష్యత్తును మార్చాలంటే ఓటుతోనే సాధ్యమని ఆర్డీఓ వంశీకృష్ణ పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పట్టణంలో పలు పాఠశాలల విద్యార్థులు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉన్నతపాఠశాల ఆవరణలో ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. తర్వాత ఆర్డీఓ మాట్లాడుతూ 18ఏళ్ల నిండిన యువతకు ఓటు హక్కును భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. జనవరి 1నాటికి 18ఏళ్ల వయసు నిండిన ప్రతిఒక్కరు ఫారం -6ద్వారా దరఖాస్తు చేసి ఓటు హక్కు పొందాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీలత, తహసీల్దార్ సునీత, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ తహసీల్దార్ ముకుంద, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత, జూనియర్ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండలంకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నాలుగురోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ 18 ఏళ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఓటును వినియోగించి దేశ భవిష్యత్తును మార్చాలని సూచించారు. మంచి నాయకున్ని ఎన్నుకుంటేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. డీటీ రవి, ఉపాధ్యాయులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

'ఎర్రగుంట భూములను కాపాడింది గోనుగుంట్లే'

ధర్మవరం, జనవరి 25: కరోనా సమయంలో మండలంలోని తుంపర్తి ఎర్రగుంట భూములను కబ్జా చేయడానికి ఎమ్మెల్యే కేతి రెడ్డి ప్రయత్నం చేయడం వాస్తవం కాదా అని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల వర్గీయులు పేర్కొన్నారు. పట్టణంలోని గోనుగుంట్ల కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో తుంపర్తి పరమేశ్, గొట్లూరు చంద్ర , నారాయణ స్వామి, దేవంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే తుంపర్తి ఎర్రగుంట భూముల జోలికి వచ్చినప్పుడు.. కరోనా సమయంలో అధికారులు ఎవరూ అందుబాటులో లేరని, చివరికి మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ జోక్యం చేసుకుని ఆ భూములను కాపాడారని తెలిపారు. ఇది వాస్తవమని, దీనిపై చర్చకు కూడా తాము సిద్ధమని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే అభివృద్ధి చేసిఉంటే మరి పట్టణ నడిబొడ్డున రోడ్లలో మోకాళ్లలోతు గుంతలు ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. ముదిగుబ్బలోని నాలుగు రోడ్ల కూడలిలోనూ రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని, వాటిని మా నాయకుడు గోనుగుంట్ల సొంతఖర్చులతో బాగుచేస్తుంటే అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో దుస్సాక్రిష్ణ, బోడగలగిరిధర్, చిలకం సూర్యనారాయణరెడ్డి, రాప్తాటి రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలి

ధర్మవరం , జనవరి 25: ప్రతిఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలని పరమిత పీఠాధిపతి వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీయోగి ముక్తేశ్వరి మాతాజీ పేర్కొన్నారు. స్థానిక సిద్దయ్యగుట్టలోని పరమపిత వెంకటరమణాచార్య గురువు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం ఆమె 12వ ఆరాధనోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సేవాగుణం అలవరచుకోవాలని, పేదలకు సేవ చేయడంలో ఉన్న ఆనందం మరెందులోనూ లేదని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ, ట్రస్టు వైస్‌ఛైర్మన్ అశోక్‌కుమార్, కార్యదర్శి రామాంజనేయ చారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

పుట్టపర్తి, జనవరి 25: పట్టణంలోని సత్యసాయి భక్తులు గురువారం గిరి ప్రదక్షిణను భక్తిశ్రద్ధల తో నిర్వహించారు. రాత్రి 7గంటల సమయంలో ప్రశాంతి నిలయంలోని గణేష్ గేటువద్ద సత్యసాయి రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆ రథాన్ని లాగుతూ.. భక్తి పాటలు పా డుతూ.. గిరిప్రదక్షిణ చేశారు. గోకులం, గణేష్ సర్కిల్, పెట్రోల్ బం కు, చింతతోపు, గోవిందపేట, శివాలయం వీధి మీదుగా సాగి తిరిగి గణేష్ గే ట్‌కు చేరుకున్నారు. అనంతరం రథానికి మంగళహారతి ఇచ్చారు.



రథాన్ని లాగుతూ గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

రమణాశ్రమంలో నారాయణసేవ



రమణమహర్షి ఆశ్రమంలో హోమంలో పాల్గొన్న భక్తులు

ధర్మవరం, జనవరి 25: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో గల రమణమహర్షి ఆశ్రమంలో గురువారం నారాయణసేవను నిర్వహించినట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు చిప్పల వెంకప్ప తెలిపారు. ముందుగా రమణమహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమంలో అరుణాచల శివనామస్మరణ మారుమ్రోగింది. అనంతరం గోమాత నెయ్యితో మహాదీపం వెలిగించారు. హోమాలు నిర్వహించారు. తర్వాత అక్షరమణమాల పారాయణం చేశారు. మధ్యాహ్నం 1గంటకు నారాయణసేవ చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

హెచ్‌ఎం వింత ప్రవర్తనతో ఉపాధ్యాయుల బెంబేలు

● వేధింపులు తాళలేక సెలవుకు సిద్ధమైన 13 మంది ఉపాధ్యాయులు

● హెచ్‌ఎంపై కలెక్టర్, డీఈఓ, ఎంఈఓ,డిప్యూటీడీఈఓలకు ఫిర్యాదు

● విచారణ చేపట్టాలంటూ డీఈఓకు కలెక్టర్ ఆదేశం

కొత్తచెరువు, జనవరి 25: పుట్టపర్తి మండలం బీడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన హెచ్‌ఎం లక్ష్మీదేవి వింత ప్రవర్తనతో ఉపాధ్యాయులు, సిబ్బంది బెంబేలెత్తుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొంతకాలంగా హెచ్‌ఎం వింత ప్రవర్తిస్తూ తమతో నిత్యం గొడవలకు దిగుతూ వేధింపులకు గురిచేస్తోందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. దీంతో పాఠశాలలో పనిచేస్తున్న 13మంది ఉపాధ్యాయులు మూకుమ్మడిగా సెలవులో వెళ్లడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ విషయం కాస్తా విద్యాశాఖ అధికారులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో వారు హెచ్‌ఎం ప్రవర్తనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం పాఠశాలకు గంటపాటు ఆలస్యంగా వచ్చిన హెచ్‌ఎం లక్ష్మీదేవి, తోటి ఉపాధ్యాయులతో గొడవకు దిగడమే కాకుండా దురుసుగా ప్రవర్తించారు. నన్ను ఎవరైనా ఎదురించడం, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం లాంటివి చేస్తే .. కులసంఘాల నాయకులతో ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టిస్తానంటూ బెదిరిస్తోందని ఉపాధ్యాయులు వాపోయారు. ప్రస్తుతం ఎఫ్‌ఏ-3 పరీక్షలు జరుగుతున్నాయని, అయితే సమయానికి హెచ్‌ఎం రాకపోవడంతో ప్రశ్నపత్రాల కోసం స్కూల్‌కాంప్లెక్స్‌లో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. దీంతో తాము పరీక్షలను ఆలస్యంగా నిర్వహించాల్సిన దుస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ఎవరైనా ఆమెను ప్రశ్నిస్తే మీకు ఇష్టం వచ్చిన వారికి చెప్పుకోండి.. నేనింతే.. నన్ను ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు పెట్టిస్తానంటూ వేధిస్తోందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా మధ్యాహ్న భోజనానికి సంబంధించి 10 బస్తాల బియ్యాన్ని జీతాలు రాలేదన్న నెపంతో ఆమె ఇంటికి తరలించిందని కలెక్టర్, డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలకు సైతం విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆమెపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. గతంలో ధర్మవరం ప్రాంతంలో పనిచేసినప్పుడుకూడా హెచ్‌ఎం లక్ష్మీదేవిపై పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. విచారణకు వచ్చిన డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ.. హెచ్‌ఎం లక్ష్మీదేవి ఎక్కడ పనిచేసినా తోటివారితో వివాదాస్పదంగా వ్యవహరిస్తుంటారని, ఈమెపై ఎక్కువ ఫిర్యాదులు కూడా వచ్చాయని, మమ్మల్ని సైతం బెదిరిస్తోందని తెలిపారు. పాఠశాలకు విచారణ కోసం వస్తే కులసంఘ నాయకులతో ఫోన్‌లు చేయించి మమ్మల్ని కూడా బెదిరిస్తుందని డీఈఓ వెల్లడించారు. ఈ విషయాలన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆమెను హెచ్‌ఎం పదవినుంచి తొలగించి మరొకరికి బాధ్యతలు అప్పగిస్తామని డీఈఓ తెలిపారు.



హెచ్‌ఎం పని తీరుపై ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులతో విచారణ చేస్తున్న డీఈఓ

రెండో రోజూ బాస్కెట్ బాల్ పోటీలు

ధర్మవరం, జనవరి 25: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో గురువారం రిపబ్లిక్‌డే సందర్భంగా ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయట్రస్టు సహకారంతో అండర్-14 ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలను రెండో రోజు ఆత్మీయట్రస్టు వైస్‌ఛైర్మన్ శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. ఇందులో మొదటి సెమీ ఫైనల్ బాలుర విభాగంలో ఎస్‌ఎస్‌బీఎన్ పాఠశాల జట్టు, అనంతపురం ఎరా స్కూల్ జట్లు తలపడ్డాయి. రెండుపాయింట్ల తేడాతో ఎస్‌ఎస్‌బీఎన్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. రెండవ బాలుర,బాలికల విభాగం సెమీఫైనల్ శుక్రవారం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

బాధితుడికి ఆర్థికసాయం

కదిరిఅర్బన్, జనవరి 25: అమడగూరు మండలం కందుకూరు పల్లికి చెందిన జనసేన నాయకుడు ఆంజనేయులు, అతడి భార్య, కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వీరు తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా గురువారం కదిరికి చెందిన జనసేన నాయకుడు, బ్లూమూన్ విద్యాసంస్థల ఛైర్మన్ శివశంకర్ బాధిత కుటుంబాన్ని ఆసుపత్రిలో పరామర్శించారు. అనంతరం రూ.30వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు భైరవప్రసాద్, గవ్వల శ్రీనివాసులు, చిన్నప్పరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి

తనకల్లు, జనవరి 25: మండలంలో పని చేస్తున్న రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు తాము పనిచేస్తున్న ప్రాంతాల్లో రైతులకు ఉపయోగపడేలా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఏఓ శ్రీహరినాయక్ తెలిపారు. మండలకేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. 50శాతం సబ్సిడీతో చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, వేరుశనగకు సంబంధించి ప్రాసెసింగ్ యూనిట్లను రైతు సంఘాలకు అందజేయనున్నట్లు చెప్పారు. అనంతరం రైతుసంఘాలతో చర్చించి అవసరమైన వాటికోసం వెంటనే దరఖాస్తులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తి దారుల సంఘాల సీఈఓలు సుధాకర్, రమణనాయక్, జనజాగృతి ప్రతినిధులు ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

అమడగూరు, జనవరి 25: కర్ణాటకనుంచి అక్రమ రవాణా అవుతున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ బలరామయ్య గురువారం తెలిపారు. మండలంలోని తలమర్లవాండ్లపల్లి గ్రామ శివారులో కర్ణాటక మద్యంను అదే గ్రామానికి చెందిన బెడదకోట శంకర్ అక్రమంగా తరలిస్తుండగా.. పట్టుకుని అరెస్టు చేశామన్నారు. అనంతరం అతడి వద్ద నుంచి 80 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. తర్వాత రిమాండ్ నిమిత్తం కదిరి కోర్టుకు హాజరు పరిచామన్నారు. ఎస్‌ఐ వెంట హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

అమడగూరు, జనవరి 25: మండలకేంద్రంలోని జగనన్న కాలనీలో గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటికి బోరు వేయించారు. కాలనీలో దాదాపు 110 నివాస గృహాలు ఉన్నాయని, వీరికి తాగునీటి సౌకర్యం నిమిత్తం బోరు వేయించామని ఎంపీడీఓ గడ్డం మునెప్ప తెలిపారు. అలాగే మౌలిక వసతులు కూడా కల్పిస్తామని పేర్కొన్నారు.

నేడు ట్రాక్టర్, బైకు ర్యాలీ

ధర్మవరం రూరల్, జనవరి 25: కేంద్రప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నల్లచట్టాలను రద్దు చేయాలని కోరుతూ సంయుక్తా కిసాన్‌మోర్చా ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జిల్లాకేంద్రాల్లో శుక్రవారం ట్రాక్టర్లు, బైకుల ర్యాలీని తలపెట్టామని, జయప్రదం చేయాలని సీపీఎం అనుబంధ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, ప్రధానకార్యదర్శి రమణ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని, కేరళ ప్రభుత్వ తరహాలో విముక్తి చట్టాన్ని తీసుకురావాలని, స్మార్ట్ మోటర్లు బిగించరాదని కోరుతూ ర్యాలీని చేపట్టనున్నట్లు చెప్పారు. పుట్టపర్తిలో ఉదయం 10గంటలకు బైకుర్యాలీని ప్రారంభిస్తామన్నారు. జిల్లాలోని రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మారుతి, ఎస్ హెచ్ బాషా, ఆదినారాయణ, అయూబ్‌ఖాన్, వెంకటనారాయణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణం పై అవగాహన

ముదిగుబ్బ, జనవరి 25: మండల కేంద్రంలోని పీవీఎస్ పాఠశాలలో గురువారం పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్‌నాయుడు హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. చెట్లను రక్షిస్తే.. తిరిగి అవి మనల్ని కాపాడతాయని చెప్పారు. పర్యావరణాన్ని రక్షిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ రమణప్ప, పాఠశాల ఛైర్మన్ పీవీ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఈరమాలమ్మ ఉత్సవాలు

అగళి, జనవరి 25: మండల కేంద్రంలో గురువారం ఈరమాలమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళల భక్తిశ్రద్ధలతో హారతులు మోస్తూ తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ప్రతి యేడు ఈరమాలమ్మ ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం రానుంది

● పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్


మాట్లాడుతున్న శైలజానాథ్

హిందూపురం అర్బన్, జనవరి 25: కాంగ్రెస్ పార్టీకి ఆంధ్రప్రదేశ్‌లో పూర్వ వైభవం రానుందని మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చెరుగని ముద్ర వేసుకున్న నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిలను ఏపీకి అధ్యక్షురాలిగా నియమించారన్నారు. తొలిసారిగా షర్మిల 28వ తేదీ అనంతపురం రానున్నట్లు తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో రాబోవు ఎన్నికల్లో అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి టీడీపీ, వైసీపీల నుంచి ఒరిగింది ఏమి లేదన్నారు. హిందూపురం అంటేనే నీటి కష్టాలు వినపడుతున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ నీరందించిందన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే రైతులు, కూలీలు, శ్రామికులు అందరూ బాగుంటారన్నారు. పదేళ్ల ప్రజలకు దూరంగా ఉన్నామని, ఇప్పుడు షర్మిల రాకతో మళ్లీ నాయకులు, కార్యకర్తల్లో ఊపు వచ్చిందన్నారు. కాంగ్రెస్ నుంచి ఇతర పార్టీల్లోకి వెళ్లిన వారందరూ తిరిగి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేటీ శ్రీధర్ మాట్లాడుతూ అజ్ఞాత వాసం ముగిసింది ఇక ముందున్నది పట్టాభిషేకమే అన్నారు. జిల్లా అధ్యక్షుడు సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాలవ హరిత, నాయకులు బాలాజీ మనోహర్, శ్యామ్‌కిరణ్, కదిరి షానవాజ్, స్వామి, పురం నాయకులు అమానుల్లా, జమీల్, ఫయాజ్, రావూఫ్ పాల్గొన్నారు.

వైసీపీ సమావేశానికి ఎమ్మెల్యే దూరం

మడకశిర టౌన్, జనవరి 25: నియోజకవర్గంలో వైసీపీ సమన్వయకర్తగా ఈరలక్కప్పను ప్రకటించిన అనంతరం గురువారం మొదటిసారిగా పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణంలో వైసీపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ అబ్జర్వర్ అశోక్‌బాబు మడకశిరకు రావడంతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, ఆయన వర్గం దూరంగా ఉంది. ఎమ్మెల్యే విజయవాడకు వెళ్లారని, ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉరవకొండ పర్యటన సందర్భంగా కలిసిన సమయంలో విజయవాడకు రావాలని సూచించడంతో వెళ్లినట్లు ఆయన సన్నిహితుల ద్వారా తెలిసింది. దీంతో సమావేశం జరుగుతున్నా ఆయన వర్గం ఇందులో పాల్గొనలేదు. మొదటి సారి సమావేశంలో అసమ్మతి బయటపడిందని ఆపార్టీ నాయకులు చర్చించుకోవడం కనిపించింది. హిందూపురం వైసీపీ పార్లమెంటు అభ్యర్థి శాంత, మాజీ మంత్రి హెచ్.బి.నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, కుంచిటిగ వక్కలిగ ఛైర్‌పర్సన్ నళిని తదితరులు హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

పుట్టపర్తి, జనవరి 25: పట్టణంలోని సత్యసాయి భక్తులు గురువారం గిరి ప్రదక్షిణను భక్తిశ్రద్ధల తో నిర్వహించారు. రాత్రి 7గంటల సమయంలో ప్రశాంతి నిలయంలోని గణేష్ గేటువద్ద సత్యసాయి రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆ రథాన్ని లా గుతూ.. భక్తి పాటలు పా డుతూ.. గిరిప్రదక్షిణ చేశారు. గోకులం, గణేష్ సర్కిల్, పెట్రోల్ బం కు, చింతతోపు, గోవిందపేట, శివాలయం వీధి మీదుగా సాగి తిరిగి గణేష్ గే ట్‌కు చేరుకున్నారు. అనంతరం రథానికి మంగళహారతి ఇచ్చారు.

ద్విచక్రవాహనాల ఢీ.. ముగ్గురికి గాయాలు

గోరంట్ల, జనవరి 25: మండలంలోని హిందూపురం రహదారి మల్లాపల్లి వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో భరత్‌కుమార్, సోముశేఖర్, వెంకటప్ప తీవ్రంగా గాయపడ్డారు. గోరంట్ల పట్టణానికి చెందిన బ్యాంక్ ఈశ్వరప్ప కుమారుడు భరత్ కుమార్ పాలసముద్రం వైపునుంచి గోరంట్లకు గురువారం ద్విచక్రవాహనంలో వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. నల్లమాడ మండలం గోపేపల్లికి చెందిన సోముశేఖర్, గోరంట్ల మండలం బెల్లాలచెరువులో పెళ్లి చేసుకున్నాడు. సోముశేఖర్ ద్విచక్రవాహనంపై బెళ్లలాలచెరువుకు వెళ్లి, తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, సమీపబంధువు వెంకటమ్మ గోరంట్లలో ఆసుపత్రికి వెళ్లాలని, ఇరువురు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మల్లాపల్లి సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఓవర్‌టేక్ చేసే సమయంలో ఢీకొన్నాయి. ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స అందించారు. తీవ్రంగా గాయడపిన సోముశేఖర్‌ను మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు. భరత్‌కుమార్‌ను బెంగళూరు తరలించారు. భరత్‌కుమార్ సమీప బంధువు కావడంతో మాజీ ఎంపీ నిమ్మలక్రిష్టప్ప ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి

మడకశిరటౌన్, జనవరి 25: నగర పంచాయతీ చౌటిపల్లి ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద గురువారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. వెంటనే కాలనీవాసులు చూసి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. కాలనీ వైపు నుంచి కొండ ప్రాంతానికి వెళుతున్న సమయంలో పెనుకొండ-మడకశిర ప్రధాన రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు కాలనీవాసులు తెలిపారు.

బియ్యం కార్డు ఇప్పించండి మహాప్రభో..!

● అధికారులను వేడుకుంటున్న మహిళ


ఆవేదన వ్యక్తం చేస్తున్న రామక్క

రొద్దం, జనవరి 25: అధికారులు తనకు బియ్యం కార్డు మంజూరు చేసి పుణ్యం కట్టుకోవాలని మండలంలోని బొక్సంపల్లికి చెందిన రామక్క వేడుకుంటోంది. ఈమెకు పదేళ్ల క్రితం కర్ణాటక ప్రాంత వాసితో వివాహమైంది. భర్తతో విడివడి, కుమార్తెతో కలిసి పుట్టింటిలోనే ఉంటోంది. బియ్యంకార్డు కోసం తిరిగి తిరిగి వేసారింది. పింఛన్ రాక, బియ్యం కార్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, బియ్యం కార్డు మంజూరు చేస్తే తన కుమార్తెకు అమ్మ ఒడైనా వస్తుందని వేడుకుంటోంది.

అధైర్యపడొద్దు... అండగా ఉంటాం: మాజీ ఎమ్మెల్యే


పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న

మడకశిర రూరల్ జనవరి 25: టీడీపీ కార్యకర్తలకు ఏ కష్టంవచ్చినా అధైర్యపడొద్దని పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న అన్నారు. మండలంలోని హరేసముద్రం గ్రామంలో పార్టీ సీనియర్ నాయకుడు హనుమంతప్ప అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఈరన్న గ్రామానికి వెళ్లి హనుమంతప్ప భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మండల మాజీకన్వీనర్ రామాంజనేయులు, మాజీ ఎంపీపీ అశ్వత్థప్ప ప్రభాకర్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు తరలిరండి

పెనుకొండ, జనవరి 25: గణతంత్ర వేడుకలను శుక్రవారం ఉదయం 8గంటలకు స్థానిక టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ సిద్దయ్య తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత


కియ పరిశ్రమ ముందు సెల్ఫీ దిగుతున్న సవిత, టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, జనవరి 25: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత అన్నారు. గురువారం మండలంలోని కియ కార్ల పరిశ్రమ ముందు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి సెల్ఫీ చాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్షేమాభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కరువు సీమ అయిన పెనుకొండకు కియ కార్లపరిశ్రమ తెప్పించి పరిశ్రమల హబ్‌గా మార్చిన నేత చంద్రబాబు అన్నారు. పరిశ్రమ రాకతో స్థానికంగా, ఇతర రాష్ట్ర యువతీ యువకులు 45వేల మందికిపైగా ఉద్యోగ అవకాశాలు కల్పించిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. కరువుసీమ అయిన రాయలసీమలో పరిశ్రమలు స్థాపించి ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో పెనుకొండలో అంతర్జాతీయ కియ పరిశ్రమ ఏర్పాటు చేయడం ఓ వరమన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక పరిశ్రమకు సంబంధించి 45 పరిశ్రమలు జేట్యాక్స్‌కు భయపడి తమిళనాడుకు పారిపోయాయన్నారు. ఆ కంపెనీలు వచ్చి ఉంటే మన ప్రాంతం ఎందో అభివృద్ధి చెందేదన్నారు. జగన్‌రెడ్డి ఫేక్ హామీలతో యువత భవిష్యత్తు నాశనం చేశారన్నారు. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే పరిశ్రమలు క్యూలో నిలబడతాయన్నారు. మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, మాజీ ఎంపీపీ కేశవయ్య, మాజీ సర్పంచ్ గుట్టూరు సూర్యనారాయణ, వీజీపాళ్యం శీన, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వస్తాడని..

● అరగంట ముందే మంత్రి ప్రారంభం
● రాత్రికి రాత్రే శిలాఫలకంలో పేర్ల మార్పు


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

హిందూపురం, జనవరి 25: పదేళ్లుగా ఆ పార్టీకి, ఆ నియోజకవర్గంలో ఏకచత్రాధిపత్యంగా వ్యవహరించాడు. జగనన్న పుణ్యమా అంటూ ఆయన హయాంలో నిర్మించిన భవనాలు ప్రారంభోత్సవానికి ఆయన ఎమ్మెల్యేగా ఉండి పాల్గొనలేకపోవడం దురదృష్టకరం. దీంతో ఆయన వర్గీయులు ఎంతగానో మదనపడుతున్నారు. పెనుకొండ నియోజకవర్గంలో పదేళ్లుగా వైసీపీ అభివృద్ధికి ప్రస్తుత ఎమ్మెల్యే శంకర్‌నారాయణ ఎంతగానో కృషిచేశారు. ప్రస్తుతం ఆయన ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నాడు. వైసీపీ వ్యతిరేక విధానాలతో ప్రజలు ఆ పార్టీ ఎమ్మెల్యేలను వ్యతిరేకించారు. దీంతో ఇంకా ఎమ్మెల్యే పదవీకాలం ఉన్నా అతన్ని పార్లమెంట్ అభ్యర్థిగా పంపి ఇక్కడికి మంత్రి ఉషశ్రీని తీసుకొచ్చారు. ఆమె వచ్చినప్పటి నుంచి స్థానిక ఎమ్మెల్యే శంకర్‌నారాయణను వ్యతిరేకిస్తూ వచ్చింది. ఆమె హయాంలో నిర్మించిన ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవానికి నిబంధనల ప్రకారం స్థానిక ఎమ్మెల్యే పాల్గొనాలి. అలాంటిది ఆయన ఈ నియోజకవర్గంలో పర్యటిస్తే ఎక్కడ నాకు డ్యామేజ్ అవుతుందోనని భావించిన మంత్రి ఆయన్ను ఇటువైపు రాకుండా చేయడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. గురువారం పరిగి మండలం సేవామందిరంలో నిర్మించిన ఆయుర్వేద వైద్యశాల భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని, అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేశారు. శిలాఫలకం కూడా సిద్ధం చేశారు. ఇందులో మంత్రి ఉషశ్రీ చరణ్‌పేరు ఎక్కడా లేదు. దీంతో మంత్రి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రికి రాత్రి శిలాఫలకాన్ని మార్చేసి మంత్రి పేరుతో మరొకటి ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే గురువారం ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే శంకర్‌నారాయణ ప్రారంభిస్తారని సంబంధిత శాఖ అధికారులు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆయన రావడానికి కూడా సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న మంత్రి అరగంట ముందు అక్కడకు చేరుకుని ఆయుర్వేద వైద్యశాలను ప్రారంభించేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాకుండా ఆగిపోయారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి



హిందూపురం, మడకశిర తహసీల్దార్లకు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

హిందూపురం, జనవరి 25: పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ గురువారం హిందూపురంలో పెన్షనర్లు నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ స్వర్ణలతకు వినతి పత్రం అందించారు. పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ 11వ పీఆర్‌సీలో 2022 జనవరి నుంచి తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను, విధిగా అంతకు ముందు ఇస్తున్న 70సంవత్సరాలు పైబడిన పదిశాతం, 75 ఏళ్లు పైబడిన వారికి 15 శాతం పునరుద్ధరించాలన్నారు. 11వ పీఆర్‌సీ, ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. హెల్త్‌కార్డు ద్వారా అన్ని వ్యాధులకు గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో వైద్యం అందించాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. రవీంద్రుడు, శ్రీనివాసులు, నరసింహులు, జమ్మన్న, పోతిరెడ్డి, రామక్రిష్ణ, సూర్యనారాయణ, వరదప్ప, తిమ్మప్ప, ఓబులేసు పాల్గొన్నారు.

మడకశిరటౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని గురువారం పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మడకశిర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. 2018 నుంచి చెల్లించాల్సిన డీఆర్ బకాయిలు, 2022 పీఆర్‌సీ బకాయిలు ఏకమొత్తంగా సత్వరమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు మల్లికార్జున్, నాయకులు గణపతి, నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెన్షనర్లు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై డీవైఈఓ ఆగ్రహం

గుడిబండ, జనవరి 25: మండలంలోని పీసీగిరి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు శశికళపై పెనుకొండ డీవైఈఓ రంగస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలు తారుమారు కావడంపై ఆరాతీసి డీవైఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. టైంటేబుల్ ప్రకారమే నిర్వహించాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని సూచించినట్లు సమాచారం. ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు రవికుమార్‌పై విద్యార్థులు సక్రమంగా పాఠాలు చెప్పడం లేదని డీవైఈఓకు ఫిర్యాదు చేశారు. సక్రమంగా విధులు నిర్వహించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో రికార్డులను, హాజరుపట్టిక, మెనూను పరిశీలించారు.

గర్భిణులకు అన్నదానం

రొద్దం, జనవరి 25: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పెనుకొండ ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సవిత ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదానం చేశారు. 15 నెలలుగా అన్నదానం నిర్వహిస్తుండగా గురువారం ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గర్భిణులు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందికి అన్నదానం చేశారు. వైద్యాధికారి సోమశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు టైలర్ ఆంజనేయులు, చెన్నకేశవులు, తిరుపాల్‌నాయుడు, రంగన్న, పెద్దవీరప్ప, లింగప్ప, చోళమర్రి జయరాములు పాల్గొన్నారు.

సీఐగా యుగంధర్ బాధ్యతలు

పెనుకొండ టౌన్, జనవరి 25: పెనుకొండ సీఐగా యుగంధర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ వీఆర్‌కు పోవడంతో ఉరవకొండ సీఐగా ఉన్న యుగంధర్ పెనుకొండకు బదిలీ అయ్యారు.

స్టార్టర్‌ను ఎత్తుకెళ్లిన దొంగలు

● తాగునీటి కోసం ప్రజల పాట్లు
● పట్టించుకోని అధికారులు

మడకశిర రూరల్, జనవరి 25: మండలంలోని సీ కోడిగేపల్లి గ్రామంలో తాగునీటి బోరుకు అమర్చిన స్టార్టర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో పదిరోజులుగా గ్రామంలో తాగునీరులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై సర్పంచు, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉన్న సమయంలో తాగునీటి కోసం వ్యవసాయబోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని తెలిపారు. గ్రామాలను ఎంతో అభివృద్ధి చేసినట్లు పేదేపదే గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం మా గ్రామంపై ఏ ఒక్క రాజకీయ నాయకుడు కన్నెత్తి చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అది కేవలం మాటలకే పరిమితమైందన్నారు. తాగునీటి బోరుకు స్టార్టరును అమర్చలేని వారు గ్రామాలు అభివృద్ధి ఎలా చేస్తారు అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


బోరుకు అమర్చిన స్టార్టరును ఎత్తుకెళ్లిన దొంగలు


వ్యవసాయ బోరు వద్ద తాగునీరు పట్టుకుంటున్న మహిళలు

అధికారుల నుంచి ఆదేశాలు అందాలి: వెంకటేశులు, కార్యదిర్శి, సీ కొడిగేపల్లి

పంచాయతీ అభివృద్ధికి రూ.1.50 లక్షలు నిధులు విడుదల చేశారు. వాటిని ఖర్చుచేయడానికి ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వాలి. ఆదేశాలు వచ్చిన వెంటనే బోరుకు స్టార్టర్‌ను అమర్చి సమస్యను పరిష్కరిస్తాం.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం

గోరంట్ల, జనవరి 25: పట్టణంలోని ఎస్‌పీఎస్ ఎయిడెడ్ జూనియర్ కళాశాల, ఎస్‌కేడీఆర్, ఎస్‌వీవీఎం డిగ్రీ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు విడివిడిగా గ్రామాల్లో గురువారం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు పలు సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఎస్‌పీఎస్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ, ఓటుకున్న విలువ, ఓటు హక్కు ఎలా ఉపయోగించాలో వివరించారు. శుక్రవారం నుంచి జీనవాండ్లపల్లిలో ఎస్ఎస్ఎస్ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ కెంపులక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ అడవాల సూర్యనారాయణ, పీఓ కళావతి, అధ్యాపకులు, విద్యార్థులున్నారు. గుమ్మయ్యగారిపల్లిలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎస్‌కేడీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాజీవ్‌కాలనీలో, ప్రిన్సిపాల్ భక్తవత్సలం ఆధ్వర్యంలో ఎస్‌వీఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలను ప్రారంభించారు.

పెనుకొండ రూరల్: నగర పంచాయతీలోని కోనాపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ (ఎన్‌ఎస్‌ఎస్) కింద శుభ్రత పనులు చేపట్టినట్లు పీఓ శంకర్‌నాయక్ తెలిపారు. గురువారం నిర్వహించిన శిబిరంలో గ్రామస్థులకు శుభ్రత పనులపై అవగాహన కల్పించారు. అనంతరం గుంతలు పడిన రోడ్లకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మట్టిని వేసి పూడ్చివేశారు. 31వ తేదీ వరకు గ్రామంలో శుభ్రతాపనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ బషీర్‌అహ్మద్, హిస్టరీ లెక్చరర్ నరసింహమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యశోద, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



గోరంట్లలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి


మడకశిర: మల్లినాయకనపల్లిలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు


కోనాపురంలో చెత్తను తొలగిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

పెనుకొండ రూరల్: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులపాటు ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. గురువారం పట్టణంలోని రాయలకాలంనాటి ప్రాచీన కట్టడం గగన్‌మహల్ వద్ద ప్రత్యేక శిబిరాన్ని ప్రిన్సిపాల్ డా.కేశవరావు, పురావస్తుశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.రజిత ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు రంగనాయకులు, ఐక్యూ కోఆర్డినేటర్ యశోదరాణి, అధ్యాపకులు చెన్నారెడ్డి, శ్రీదేవి, హరి, శ్రీనివాసులు, కాంతారావు పాల్గొన్నారు.

మడకశిరటౌన్: విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బయ్య అన్నారు. గురువారం ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా మల్లినాయకనపల్లి గ్రామంలో క్యాంపు నిర్వహించారు. 50 మంది విద్యార్థులు గ్రామంలో శ్రమదానంచేసి పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాల పరిశుభ్రం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓ ఎన్.అనీల్‌కుమార్, అధ్యాపకుడు చంద్రశేఖర్‌నాయక్ పాల్గొన్నారు.

ఓటును ఆయుధంగా వాడుకోవాలి: సబ్ కలెక్టర్


ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

పెనుకొండ టౌన్, జనవరి 25: మంచి ప్రభుత్వాలను ఎన్నుకునేందుకు ఓటును ఆయుధంగా వాడుకోవాలని సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ పిలుపునిచ్చారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ జెండా ఊపి ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఐదేళ్లకోసారి వచ్చినా మన తలరాతలు మార్చేది ఎన్నికలేనన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే 80ఏళ్లు దాటిన వృద్ధులను సన్మానించారు. తహసీల్దార్ సురేష్‌బాబు, బీజేపీ రామక్రిష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఈరమాలమ్మ ఉత్సవాలు


అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

అగళి, జనవరి 25: మండల కేంద్రంలో గురువారం ఈరమాలమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళల భక్తిశ్రద్ధలతో హారతులు మోస్తూ తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ప్రతి యేడు ఈరమాలమ్మ ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాలకు జడ్పీటీసీ ఉమేష్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన భక్తాదులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలని ధర్నా


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, మహిళలు

హిందూపురం అర్బన్, జనవరి 25: ఇళ్లు లేని పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి స్థలం కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జడ్పీ శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ బాబావలి, వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి రమణ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ హిందూపురం ప్రాంతంలో చాల మంది నిరుపేదలు ఇళ్లు లేక బాడుగ ఇళ్లలో నివసిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఇళ్ల స్థలాలు కేటాయింపులో ఆలస్యం చేస్తోందన్నారు. ఎన్నిసార్లు ఇంటి స్థలం కేటాయింపునకు అర్జీలు పెట్టుకున్నా ఇవ్వలేదని ఆగ్రహించారు. వారం రోజుల్లో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని లేని పక్షంలో ఇప్పటికే ప్రభుత్వ స్థలం గుర్తించామని అందులో ఎర్ర జెండాలు పాతి గుడిసెలు వేసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. తహసీల్దార్ మాట్లాడుతూ నవరత్నాలలో భాగంగా ఇంటి స్థలాలకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ స్థలాలు కేటాయించామని ఇప్పుడు అవకాశం లేదన్నారు. మీరు ఇచ్చిన అర్జీలు ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాబా, కేవీపీఎస్ జ్యోతమ్మ, నారాయణ, రాముగు, గోవిందప్ప, భాస్కర్, విమల, కుమారి, సరస్వతి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో సచివాలయ ఉద్యోగులు, పీఈటీలు

రొద్దం, జనవరి 25: డివిజన్ స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్ర ఖోఖో పోటీల్లో రొద్దం నుంచి మహిళలు, పురుషుల విభాగంలో పాల్గొన్న విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రామక్రిష్ణ తెలిపారు. రెండురోజులపాటు పెనుకొండలో నిర్వహించిన డివిజన్ స్థాయి ఖోఖో పోటీల్లో మండలం నుంచి విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ప్రతిభ కనబరచినందుకు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కలిపి సచివాలయ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, కంబాలపల్లి సచివాలయ కార్యదర్శి మోహన్, పీఈటీలు మహేష్, రాధ, రమేష్ పాల్గొన్నారు.

కల్లురొప్పంలో తాగునీటికి కటకట

గుడిబండ, జనవరి 25: మండలంలోని కల్లు రొప్పం గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామ ప్రజలు తాగునీటి కోసం వ్యవసాయ బోరుబావులను ఆశ్రయిస్తున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో నీటి కోసం పనులు వదులుకుని కాపుకాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


తాగునీటి కోసం వేచివున్న గ్రామస్థులు